క్లుప్తంగా

మనుబోలమ్మకు స్వర్ణ కవచాల బహూకరణ



స్వర్ణ కవచాల అలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు : మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మకు దాతలు స్వర్ణ కవచాలను సోమవారం బహూకరించారు. గ్రామానికి చెందిన చెన్నూరు కోదండరామిరెడ్డి- అనసూయమ్మ, సునీల్-అజిత దంపతులు సుమారు రూ.2 లక్షల విలువ చేసే స్వర్ణ కవచాలను చేయించి అమ్మవారికి ఇచ్చారు. అర్చకుడు సాయిశర్మ మనుబోలమ్మకు మంత్రోచ్ఛారణల మధ్య పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వర్ణ కవచాలను అమ్మవారికి అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

21 నుంచి పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో స్వామి అమ్మవార్లు(ఫైల్)

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో రుక్మిణి సమేత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగుతాయని గ్రామ భక్తజన బృందం వారు వెల్లడించారు. తొలిరోజు ఉదయం అఖండ దీపారాధన, స్వామివారికి పంచామృతాభిషేకం, ధ్వజారోహణ, హోమం, పల్లకిసేవ, హరేరామ భజన ఉంటుందన్నారు. 22న గరుడసేవ, గ్రామోత్సవం, 23న స్వామి అమ్మవార్ల కల్యాణం, గిన్నెభిక్ష గ్రామోత్సవం, 24న పాండురంగస్వామి అగ్నిగుండ ప్రవేశం, 25న వసంతోత్సవం, ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయని తెలిపారు.

ప్రగతి పథంలో పొదలకూరు

- బిట్-3 సచివాలయ పరిధిలో రూ.73.35 కోట్లతో అభివృద్ధి పనులు
- డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.23.23 కోట్ల సంక్షేమం

పొదలకూరు : పొదలకూరు బిట్-3 సచివాలయ పరిధిలో అభివృద్ధి, సంక్షేమం నాలుగున్నరేళ్ల కాలంలో పరుగులు పెట్టింది. ఇక్కడి కాలనీల్లో అంగుళం కూడా ఖాళీ లేకుండా సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాయి. వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి పథకాలను అందజేస్తున్నారు. జగనన్న లేఅవుట్లలో పేదలకు ఇంటి నివేశన స్థలాలను అందజేయడంతో పాటు, ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో బాధపడుతున్న శింగయ్యచేను, అగచాట్లపురం కాలనీ వాసులకు మంత్రి కాకాణి శాశ్వత పరిష్కారం చూపారు. ఇళ్లపై వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలను రూ.85 లక్షల నిధులు వెచ్చించి మార్పించారు. మంత్రి చొరవతో బిట్-3 సచివాలయ పరిధిలో 2019 నుంచి 2023 వరకు రూ.73.35 కోట్ల పైచిలుకు అభివృద్ధి పనులు జరిగాయి.

పక్కపక్కనే సచివాలయం, ఆర్బీకే భవనాలు



పొదలకూరు బిట్-3 సచివాలయం, ఆర్బీకే భవనాలు



నాడు-నేడులో భాగంగా నిర్మించిన జెడ్పీహైస్కూల్ భవనం

స్థానికంగానే బిట్-3 సచివాలయం, ఆర్బీకే భవనాలను నిర్మించారు. ఇవి చూడచక్కగా ఉండడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఈ భవనాలను ఇటీవల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. గతంలో పట్టణంలో తాగునీటి ఎద్దడి ఉండేది. అయితే ఇప్పుడు అలాంటి కష్టాలు లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవడం వల్ల వేసవిలోనూ నీటి కష్టాలు లేకుండాపోయాయి. పట్టణంలోని సందుగొందుల్లో సైతం మురుగు కాలువలను నిర్మించడం వల్ల మురుగునీరు వెళ్లేందుకు అనుకూలంగా మారింది. ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్డుపై రూ.2 కోట్లతో సిమెంటురోడ్డు వేయించారు. దీంతో ప్రజలు సుఖవంతమైన ప్రయాణం చేస్తున్నారు. వీధివీధిలో అంతర్గత సిమెంటురోడ్ల నిర్మాణం పూర్తి చేయడం వల్ల మట్టిరోడ్లు కనిపించడం లేదు.

పొదలకూరు బిట్-3 సచివాలయ పరిధిలో..	
డీబీటీ లబ్ధిదారుల సంఖ్య	4,710 మంది
బ్యాంకులో జమైన నగదు	రూ.14,24,29,116
నాన్‌డీబీటీ లబ్ధిదారుల సంఖ్య	2,292 మంది
నగదు రూపంలో	రూ.9,99,36,557
డీబీటీ, నాన్ డీబీటీ నగదు మొత్తం	రూ.23,23,65,673



సచివాలయ పరిధిలో వేసిన సిమెంటురోడ్డు



బిట్-3 పరిధిలోని వీధిలో నిర్మించిన సైడ్‌డ్రెయిన్లు

ఎక్కడా మట్టిరోడ్డు లేదు



అగచాట్లపురంలో ఎక్కడా మట్టిరోడ్డు లేదు. గతంలో మురుగుకాలువ నిర్మాణానికి కూడా నోచుకోలేక పోయాం. తక్కువ సమయంలో ఇంతపెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని అనుకోలేదు.

– షేక్ గుల్జార్, అగచాట్లపురం, పొదలకూరు

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం



ఎన్నో ఏళ్లుగా విద్యుత్ తీగల సమస్యతో బాధపడుతున్నాం. ఈ సమస్యను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే స్పందించిన ఆయన ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను మార్పించారు.

– చెన్నూరు లక్ష్మీదేవి, శింగయ్యచేను వీధి, పొదలకూరు

సకాలంలో నిధులు



మంత్రి కాకాణి ప్రోత్సాహంతో సిమెంట్‌రోడ్లు, సైడ్ డ్రెయిన్ల పనులను పూర్తి చేశాం. ప్రభుత్వం సకాలంలో నిధులను మంజూరు చేయించడం వల్ల కాలనీల్లో అభివృద్ధి పనులను చేపట్టాం.

– వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఉప సర్పంచ్, పొదలకూరు

ప్రతి వీధికి సిమెంట్ రోడ్డు



పొదలకూరు పట్టణంలో జరిగిన అభివృద్ధి ఎక్కడా జరిగి ఉండదు. అడిగిన ప్రతి వీధికి సిమెంటురోడ్డును మంజూరు చేయించారు. మంత్రి కాకాణి నిధుల వరద పారించడం వల్ల పనులు చేయడం సాధ్యమైంది. ఆయనకు ప్రజలు ఓటు రూపంలో రుణం తీర్చుకునే సమయం వచ్చింది.

– జి.లక్ష్మీకల్యాణి, బిట్-3 ఎంపీటీసీ సభ్యురాలు, పొదలకూరు

రోడ్లు పూర్తి చేశాం



అడిగిన ప్రతివీధిలో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాం. పొదలకూరు బిట్-3 పరిధిలో మట్టిరోడ్డు లేదు. రూ.కోట్లాది నిధులతో రోడ్డు పనులు పూర్తి చేశాం.

– ప్రసాద్, పీఆర్ ఏఈ, పొదలకూరు

ఎన్నికల నియమావళిపై ప్రత్యేక దృష్టి



పోస్టర్ల తొలగింపును పర్యవేక్షిస్తున్న ఈఓపీఆర్డీ డేవిడ్

కొడవలూరు: కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికల నియమావళిపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నారు. ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ ఆదేశాల మేరకు ఈఓపీఆర్డీ వి.డేవిడ్ మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం విస్తృతంగా పర్యటించి ఆయా పంచాయతీ కార్యదర్శుల సహకారంతో రాజకీయ పార్టీల పోస్టర్‌లు, హోర్డింగ్‌లు తొలగింపజేశారు. మతపరమైన పోస్టర్‌లపై రాజకీయ నేతల ఫొటోలుంటే వాటినీ తొలగించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాల్లోని రాజకీయ పార్టీల పోస్టర్‌లు, హోర్డింగ్‌లు తొలగించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. నేతల విగ్రహాలకు సైతం ముసుగులు వేశామని వివరించారు.

హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక చికిత్స

నెల్లూరు(అర్బన్): అధిక రక్తపోటు, మధుమేహం, రక్తహీనత లాంటి సమస్యలున్న హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్యం అందేలా అధికారులు, వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య రక్షణపై సోమవారం సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సంబంధిత సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ హైరిస్క్ ఉన్న గర్భిణులకు మంచి పోషకాహారం అందించడం, నెలనెలా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించడం, తగిన మందులు అందజేయడం లాంటివి పక్కాగా చేయాలని సూచించారు. సకాలంలో వైద్య సేవలందించడం ద్వారా మాతా, శిశు మరణాలను అరికట్టవచ్చన్నారు. క్లిష్టమైన గర్భిణి కేసులను జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలని సూచించారు.

బుచ్చిలో కేంద్ర బలగాల కవాతు



బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో కేంద్ర బలగాలు సోమవారం కవాతు చేపట్టాయి. పలువీధుల్లో తిరుగుతూ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రజలకు తెలియజేశారు. అసాంఘిక కార్యకలాపాలు, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో సీఐ హైమారావు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

నెల్లూరు(బృందావనం): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని 9వ డివిజన్ నవాబుపేట బాబామియా మసీదులో వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థి ఎం.డి.ఖలీల్ అహ్మద్ సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, షేక్ కరీముల్లా, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హంజాహుస్సేనీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మీరా మొహిద్దీన్ పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

వెంకటాచలం : విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక, సేవా కార్యక్రమాల గురించి ఆలోచన చేయాలన్నారు. తరగతి గదుల బయట నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగంలో ఉంటే అన్ని విషయాలు పూర్తిస్థాయిలో తెలుసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ అధికారి విద్యా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పతనం ఖాయం



వైఎస్సార్‌సీపీలో చేరిన పాపిరెడ్డిపాళెం నేతలతో మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ పతనం ఖాయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన 15 టీడీపీ కుటుంబాలు ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరాయి. టీడీపీ నేతలు గోడా నాగేశ్వరరావు, గంగపట్నం వికాశ్, వంగపూడి మధు తదితరులు నెల్లూరులోని మంత్రి కాకాణి నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల వల్ల రోజురోజుకు వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరిగిపోతున్నాయన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు సముచిత న్యాయం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు తిరువళ్లూరు ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు, దద్దోలు వెంకటకృష్ణయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు పక్కాగా జరగాలి



మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ డీపీఎంఓ రమేష్

కోవూరు : పీహెచ్‌సీల్లో గర్భిణులకు అందించే వైద్యం వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ డీపీఎంఓ రమేష్ తెలిపారు. మండలంలోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది, సూపర్‌వైజర్లతో ఆయన సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎంఓ రమేష్ మాట్లాడుతూ గర్భం దాల్చిన యువతి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పక నమోదు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా బాలింతలు, శిశువుల వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేయడమే కాకుండా వారికి సంబంధించిన వైద్య పరీక్షల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎం మంజుల, వైద్యాధికారి డాక్టర్ నిరంజన్, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

రేపు పెన్షనర్ల సమావేశం

నెల్లూరు(అర్బన్): ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వర్ధమాన సమాజం కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు పెన్షనర్ల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.లక్ష్మీనారాయణ, వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ సభ్యులు ఈ సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

పది పరీక్షలు ప్రశాంతం



విడవలూరు: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

వెంకటాచలం : మండలంలో పదో తరగతి పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో 998 మంది విద్యార్థులకు గానూ 959 మంది హాజరై, 39 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు కావడంతో విద్యార్థినీ, విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్ద హడావుడిగా తిరిగారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష కాగా, కొంత మంది విద్యార్థులు ఉదయం 8 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు.

➡ ముత్తుకూరు : టెన్త్ పరీక్షలు సోమవారం ముత్తుకూరు మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 144 సెక్షన్ మధ్య పటిష్టమైన పోలీస్ బందోబస్తుతో పరీక్షలు మొదలయ్యాయి. ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్, వీబీఆర్ హైస్కూల్, గురుకుల పాఠశాల, పిడతాపోలూరు రత్నం హైస్కూల్ తదితర పరీక్ష కేంద్రాల వద్ద మొదటి రోజున ఉదయం 8 నుంచే విద్యార్థులు బంధువులు, తల్లిదండ్రులతో చేరిపోయారు. హాల్ టికెట్ల నంబర్లు చూసుకుని పరీక్ష కేంద్రంలోకి అడుగుపెట్టారు. పెద్ద ఎత్తున బంధువులు చేరిపోవడం వల్ల గురుకుల పాఠశాల, హైస్కూల్ వద్ద వాహనాల రాకపోకలకు అవరోధం ఏర్పడింది.

➡ పొదలకూరు : మండల పరిధిలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరిగాయి. మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో 865 మంది ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పట్టణంలోని మూడు పాఠశాలలతో పాటు మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీహైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందుబాటులో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఉంచారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు జరిగాయి.

➡ తోటపల్లిగూడూరు : మండలంలోని చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు, చెన్నపల్లిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష జరిగాయి. చిన్నచెరుకూరు పరీక్ష కేంద్రంలో చిన్నచెరుకూరుతో పాటు అల్లీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, విశ్వం ఇంగ్లిష్ మీడియం స్కూల్, నరుకూరు ఎయిమ్స్, బాలాజీ విద్యామందిరం స్కూల్స్ విద్యార్థులు పరీక్షలు రాశారు. చెన్నపల్లిపాళెం పరీక్ష కేంద్రంలో చెన్నపల్లిపాళెంతో పాటు కోడూరు గురుకుల పాఠశాల విద్యార్థులు, తోటపల్లిగూడూరు పరీక్ష కేంద్రంలో తోటపల్లిగూడూరుతో పాటు ఈదూరు, వరిగొండ జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ మూడు కేంద్రాల్లో 563 మంది విద్యార్థులకు గానూ తొలిరోజు సోమవారం 541 మంది పరీక్షకు హాజరయ్యారు.

➡ మనుబోలు : మండల కేంద్రమైన మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. బాలికల హైస్కూల్‌లో 210 మందికి గానూ 208 మంది, బాలుర హైస్కూల్‌లో 122 మందికి గానూ 79 మంది పరీక్షకు హాజరయ్యారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. స్థానిక ఎస్సై అజయ్‌కుమార్ హైస్కూల్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష ముగిసే సమయంలో పాఠశాల వద్ద పెద్ద ఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి వాతావరణం నెలకొంది.

➡ విడవలూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రం ఇన్‌చార్జి వై.శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని ఊటుకూరు, అలగానిపాడు, ముదివర్తి, పార్లపల్లి, విడవలూరు విద్యార్థులు స్థానిక పాఠశాలలో పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద హెడ్ కానిస్టేబుల్స్ మస్తానయ్య, పెంచలయ్య బందోబస్తు చేపట్టారు.

➡ కొడవలూరు: మండలంలోని ఐదు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. నార్తురాజుపాళెం, కొడవలూరు, యల్లాయపాళెం, గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలు, బొడ్డువారిపాళెం ఒవెల్ ఇండియా ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరిగాయి. అన్ని కేంద్రాల్లో తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు.

➡ కోవూరు : మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, జేబీఆర్ ప్రభుత్వ పాఠశాల, సెయింట్ పాల్స్ పాఠశాల, వశిష్ట ఆంగ్ల మాధ్యమ పాఠశాల, ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరిగాయి. మొత్తం 816 మంది విద్యార్థులకు గానూ 779 మంది హాజరయ్యారు. 37 మంది గైర్హాజర్యారు.

➡ ఇందుకూరుపేట : మండలంలో ఎంకేఆర్ ఉన్నత పాఠశాల, ఇందుకూరుపేట, నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు జరిగాయి. మూడు పరీక్ష కేంద్రాల్లో 455 విద్యార్థులకు గానూ 419 మంది హాజరయ్యారని ఎంఈఓ వెంకటేశ్వర్ నాయక్ తెలిపారు.



ముత్తుకూరు : పరీక్ష కేంద్రం వద్ద గుమిగూడిన విద్యార్థులు



కొడవలూరులో పరీక్షకు క్యూలో వెళ్తున్న విద్యార్థులు



కోవూరు : హాల్ టికెట్ నంబర్లను సరిచూసుకుంటున్న విద్యార్థులు



పొదలకూరు : పరీక్ష కేంద్రాలకు తరలి వెళ్తున్న విద్యార్థులు



తోటపల్లిగూడూరు : చిన్నచెరుకూరు పరీక్ష కేంద్రంలో..



మనుబోలు : విద్యార్థులు, తల్లిదండ్రులతో హైస్కూల్ ప్రాంగణం